# పునర్జన్మ

(కథానిక)

"అమ్మమ్మా! నాన్నొచ్చాడే" అంటూ వంటింట్లోకి పరుగెత్తాడు రామం, దూరంనించి బ్రహ్మానందాన్ని చూసి. వాళ్లమ్మమ్మ వొంటింట్లో పొగలో మునిగివుంది. తాతయ్య వాకిట్లో కూచుని ముక్కుపొడుం నూరుకుంటున్నాడు.

బ్రహ్మానందం గుమ్మంలో అడుగు పెట్టాడు. నలభైఏళ్ళ పైనుంటాయి.

"రావోయ్! కూచో" అన్నాడు తాతయ్య ఎదురుగుండా వున్న చేతులకుర్చీని చూపిస్తో. అటువైపు తిరిగాడు, కూచునే!

అమ్మమ్మ కాళ్లు కడుక్కునేందుకు నీళ్ళు పెడుతూ, పమిటచెరుగుతో కళ్లుతుడుచుకుంది. రామానికి పదమూడేళ్ళుంటాయి. దూరంగా ఒక తాటిస్తంభాన్ని ఆనుకుని నించున్నాడు మౌనంగా. బ్రహ్మానందం కాళ్ళు కడుక్కుని కుర్చీలో కూచున్నాడు.

అమ్మమ్మకి దుఃఖం పొర్లివొచ్చింది. తిన్నెమీద కూచుని పైకి ఏడవసాగింది. రామం వెళ్ళి పక్కని కూచున్నాడు.

తాతయ్య ఓక్షణం అర్థంకానట్టు చూశాడు. బ్రహ్మానందానికి యిరుకున పడినట్టయింది.

"ఎందుకూ ఊరికే కళ్ళంబడి నీళ్ళు పెట్టుకుంటున్నావు? ఎంత ఏడిచినా మన అమ్మాయి బతికిరాదు. అదుగో వాణ్ణి చూడు. వాడే మనకి అన్నీని. ఊరికే వాణ్ణి బెదరగొట్టకు" అన్నాడు తాతయ్య గద్గదకంఠంతో. విచారంలో క్షణంలో రొంపపట్టినట్టయి ముక్కులోకి నీళ్ళొచ్చాయి. వెంటనే కొంచెం ముక్కుపొడుం తీసుకుని గట్టిగా పీల్చాడు.

రామం ఏదో కలలో నాటకాన్ని చూస్తున్నవాడిలా అయోమయంగా వున్నాడు. బ్రహ్మానందానికి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఇలా రా. నాన్నా!" అని కొడుకుని దగ్గరికి తీసుకున్నాడు, కుర్చీలో కూచునే. రామం తండ్రిపక్కనే నించున్నాడు.

అమ్మమ్మకి దుఃఖం కొంచెం తగ్గి, ఒక పొడి దగ్గు దగ్గింది.

"పాపం! అతనెప్పుడు బయలుదేరేడో కొంచెం కాఫీ ఇయ్యి" అన్నాడు తాతయ్య.

అమ్మమ్మ వొంటింట్లోకి వెళ్ళింది. వాకిట్లో కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

తాతయ్య ఇంతవరకూ చేత్తో నిలబెట్టి పట్టుకున్న పొడుంకాయ కిందబెట్టాడు.

అమ్మమ్మ చిక్కని గేదెపాలతో కాఫీ కలిపి తీసుకొచ్చింది.

"ఇప్పుడే హోటల్లో తాగి వొచ్చాను" అన్నాడు వొద్దని చెయ్యి అడ్డుపెడుతూ.

"అమ్మాయి పోతే మేం చేద్దైనాం గాని కాఫీ చేదవుతుందా? ఫరవాలేదు, తాగు" అంది అమ్మమ్మ.

అతను ఎదురు చెప్పలేక తీసుకున్నాడు.

"అల్లా అంటావేం? అతనుమాత్రం సంతోషిస్తున్నాడా యేమిటి?" అన్నాడు తాతయ్య.

"అది కాదు..." అని ఏదో చెప్పబోయింది అమ్మమ్మ.

"ఉత్తరమన్నా రాయకండా వొచ్చావు. ఏమిటీ విశేషం?" అన్నాడు మామగారు బ్రహ్మానందంతో, ఆవిడమాట కడ్డువెళ్ళి.

"అబ్బాయిని తీసుకువెడదామని" అన్నాడు అతను.

"ఇక్కడే వుంటే యేం?" అంది అమ్మమ్మ.

"ఇల్లంతా ఏదో విచారంతో కమ్ముకుని వుంది. వీడుకూడా లేకపోతే మరీ దిగులుగా వుంది. ఎంత మర్చిపోదామనుకున్నా పాత జ్ఞాపకాలు తల బద్దలు చేస్తున్నాయి" అన్నాడు బ్రహ్మానందం.

"తీసుకువెళ్ళు. తల్లివైనా, తండ్రివైనా నీవే అనుకో. నీకెప్పుడన్నా వాడివల్ల ఇబ్బంది కలి

శాంతి కృష్ణమూర్తి

గితే మాత్రంమాదగ్గరవిడిచిపెట్టు. మేంఉన్నంత కాలం వాడికి లోటురాదు'' అన్నాడు తాతయ్య.

అమ్మమ్మ చెప్పబోయిన మాటలు అక్కడే ఆగిపోయాయి.

కాసేపు ఆగి ''మడిగట్టుకోవచ్చును'' అంది.

''లేవోయ్'' అన్నాడు మామగారు.

''అప్పుడేనా? ఇంకా పదైనా కాలేదే? ఇప్పుడే జగన్నాథాన్ని చూసొస్తా'' నన్నాడు బ్రహ్మానందం వీథిలోకి వెళ్ళడానికి లేస్తూ. జగన్నాథం ఆ వూళ్ళోనే అతని పరిచితులలో ఒకడు. ''తొరగా రా'' అని, అతను వెళ్ళాక తాతయ్య పొడుం నూరడంలో పడ్డాడు.

అమ్మమ్మ వంటింటిలోకి నిష్క్రమించింది.

రామం కూడా వెళ్ళాడు. ఇందాకటి పొగ లేదు. పీటవేసుకుని కూచుని, రామాన్ని దగ్గరకి తీసుకుంది.

''మీ నాన్నతో వెడతావా?''

''వెడతా నమ్మమ్మా.''

''అరి, వెధవా? ఇక్కడేం బండలు ఎత్తుతున్నావని? ఇదివరకులా కాదు అక్కడ''

''ఏం?''

''కొత్త దొరసానిగారు రాజ్యం ఛలాయిస్తుంది. అయినా నువ్వేం భయపడకు. నీ బట్టలు, స్కూలు, చదువూ ఇవి చూసుకో. అంతే. ఆవిడేమన్నా అంటే తిరిగి అనకు. నాన్నతో చెప్పు. అతనే చూసుకుంటాడు'' అంది.

రామాని కేం బోధ పళ్ళేదు. తనకి తన స్కూలూ, చదువు తప్ప ఇతర విషయాల్తో ప్రసక్తేంవుంది అనుకున్నాడు. సమయానికి ఇంత తిండిపెడితే చాలు. అంతే!

పదేళ్ళు గడిచాయి! ఈ దశాబ్దంలో రామం జీవితంలో చెప్పలేని మార్పులు జరిగాయి. అతని అమ్మమ్మ, తాతయ్యా మరణించారు. తండ్రి పూర్తిగా సవతి తల్లి రమణమ్మకి స్వాధీనమై, ఆవిడ చెప్పుచేతుల్లో మనిషైపోయాడు.

ప్రపంచంలో అతనికి దగ్గరివాళ్ళెవరూ లేరు. అతనికి వున్నది తండ్రి ఒక్కడే! తండ్రి క్రమంగా తనకి కానివాడయ్యాడు.

రమణమ్మ కాపరానికొచ్చాక రెండేళ్ళ వరకూ సంసారాన్ని మామూలుగా గడిపింది. తర్వాత ఒక ఆడపిల్ల కలిగింది. దానితో ఆమెలో స్వార్థం తలెత్తింది.

కొద్దిఏళ్ళలో తనభర్త ఎలాగూ చనిపోతాడు, తనకా మగపిల్లలు లేరు. తర్వాత ఆస్తి అంతకీ రామం అధికారి అవుతాడు. అప్పుడు తనగతీ తన కూతురుగతీ ఏం కావాలి?

అందుకనే చేరవేయగలిగిందంతా తన పుట్టింటికి చేరవేసేది. చదువు ఎక్కువ చదివితే రామం మారిపోతాడని స్కూలు ఫైనలుతోనే ఆపించింది. తర్వాత వ్యవసాయంలో పెట్టింది. అంతకీ లొంగకపోతే భర్తతో చెప్పి పెళ్ళి చేయించింది.

పెళ్ళయినతర్వాత రామం జీవితంలో చాలా మార్పు కలిగింది. సవతల్లిపెట్టే కష్టాలకి అలవడిపోయి ఒక రకమైన బానిసత్వానికి అలవాటు పడ్డట్టయ్యాడు.

మొదటిరోజుల్లో రమణమ్మనికూడా తల్లిలాగే ప్రేమించి గౌరవించేవాడు. తర్వాత ఆవిడలో స్వార్థం తలెత్తాక, అమ్మమ్మా తాతయ్యలు చనిపోయాక, తండ్రి నెదిరించడానికి ధైర్యంలేక అలాగే వుండిపోయాడు. కాని భార్య సూర్యకాంతం కాపరానికి వొచ్చేక, అలా వుండలేకపోయాడు.

ఒకనాడు సూర్యకాంతాన్ని పాలు పితకమంది రమణమ్మగారు. సూర్యకాంతం తండ్రి ఎక్కడో పట్నంలో తాలూకాఫీసు గుమాస్తాగా వుంటున్నాడు. అంతగా వున్నవాళ్ళు కాకపోయినా ఆవిడ ఇల్లాంటిపనులు చేసి యెరగదు.

''నాకు చాతకాదు'' అంది సూర్యకాంతం.

''భోజనమేనా చాతనైంది. చాతకాదు అనడం చాతనవునా? నేర్చుకో. మేమందరం చెయ్యడంలా?'' అంది రమణమ్మగారు.

సూర్యకాంతానికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ముఖం చిన్నబుచ్చుకుంది.

''పోనీ, నేను పితుకుతాను లే పిన్నీ'' అన్నాడు రామం.

మూల కుర్చీలో కూచున్న బ్రహ్మానందాన్ని చూసి ''చూశారా అబ్బురం!'' అంది రమణమ్మగారు.

"ఏంరా? అలా వెనకేసుకొస్తావేం? ఇప్పుడు పని నేర్చుకోకపోతే, ఇంకెందుకు పనికొస్తుంది అది" అన్నాడు తండ్రి!

రామం తలొంచుకున్నాడు.

సూర్యకాంతం, పాలు పితకడానికి బయలుదేరింది. కాళ్ళకి బంధం వేసి, నీళ్లుకొట్టి పాలు పితకసాగింది. గేదె రెండుమూడుసార్లు పక్కలకి పోయింది. అయినా గేదెని ఒకసారి తట్టి, మళ్ళీ అక్కడికి వెళ్ళి పితకసాగింది. కొంత పితికేటప్పటికి గేదె ఫెడీల్‌మని తన్నింది. సూర్యకాంతం చెయ్యిలోని చెంబు కిందపడి పాలు వొలికిపోయాయి. ఆవిడ వెళ్ళి, వెనక్కి పడింది. కొంచెం మోచెయ్యి, వీపు కొట్టుకుపోయాయి.

ఆవిడ అరుపూ, చెంబుపడిన చప్పుడూ విని రమణమ్మా, రామం బయటకొచ్చారు.

"పాలన్నీ భూమిపాలు చేసేవుటే? నీ సుకుమారం చట్ట బండలుగానూ" అంటూ అరిచింది రమణమ్మ. రామం దగ్గిరికొచ్చి, ఆమెని తీసుకుని గదిలోకి చేరవేశాడు. కాని భార్యతో ఏం మాట్లాడలేదు. తిన్నగా పొలం వెళ్లాడు. మధ్యాహ్నం పొలంలోనే భోజనం చేశాడు.

సూర్యకాంతానికి పొద్దున్న కలిగిన అదటులో దుఃఖం దానికితోడు జ్వరం తగిలాయి. రమణమ్మ అన్నం తినమని అడగనూలేదు, పలకరించనూ లేదు.

ఆవిడ కూతురుమాత్రం "ఏం, వొదినా అన్నం తినవూ?" అంది.

"తిననమ్మా, జ్వరంగా వుంది" అంది. సూర్యకాంతం మామగారు భోజనం దగ్గర అన్నారు "అమ్మాయి సూరీడు అన్నంతినదూ" అని.

"ఆ రాణీగారికి జ్వరంతగిలిందిట. దానిమీద అన్నం తింటే ఇంకే మొస్తుందో?" అంది రమణమ్మ.

బ్రహ్మానందం మరి వూరుకున్నాడు.

సూర్యకాంతం తలగడలు తడిసేలా తనలోనే యేడవసాగింది. ఆమె భర్త సంగతేం పాలుపోలేదు. ప్రపంచంలో మనుషులకి ఇంత అడకువా, సహనమూనా! ఎవరైనా వాళ్ళకి వాళ్ళు ఎంతైనా కష్టాలు పడవచ్చు. అయినా వాళ్ళ మూలాన ఇతరుల్ని బాధల పాలు చెయ్యడమా? అదైనా అర్థం లేనిది, అనవసరం అయినదీని. తన భర్త బీదవాడైతే ఆమెకి కష్టం లేదు. అతను కఠినుడైనా అంతే! కాని ఎక్కడో సవతి అత్తగారివలన బాధలుపడ్డం ఆమెకేమీ న్యాయంగా కనపడలేదు.

అవును! వాళ్ళనాన్న వాళ్ళకే ఎవరికో యిచ్చి పెళ్ళి చెయ్యడంతో వాళ్ళ బాధ తీరింది. ఇంక భర్త? ఎదురు చెప్పే శక్తిలేదు. ఆ మహాతల్లి ఇంట్లో తక్కిన వాళ్ళందర్నీ ఏదో జంతువులుగా చూస్తోంది. తనా ఈ కష్టాన్ని భరించలేకండా వుంది అయినదానికీ కానిదానికీని. ఏవోఆలోచనలు తోచసాగాయి.

తర్వాత కొంతసేపటికి నీరసంతో నిద్రపోయింది.

సంధ్యవేళ భర్త యింటికి వొచ్చాడు. ఆమెని లేపాడు.

"ఏమండీ ఇంకా తెల్లారలేదే? అప్పుడే లేపుతారేమిటి?"

"తెల్లారడమేమిటి? రాత్రవు తేను. ఏం ఇలా పడుకున్నావు?"

పక్కన కూచుని సూర్యకాంతం తలని వొళ్ళోకి తీసుకున్నాడు. బ్రహ్మానందం వూళ్ళోకి పేకాట వెళ్ళాడు. రమణమ్మా కూతురు పెత్తనానికి వెళ్ళారు.

సూర్యకాంతానికి ఆ వేళటి సంఘటనలన్నీ గుర్తుకొచ్చి, దుఃఖం ముంచుకొచ్చి అతని ఒడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. రామానికి ముందర ఏం అర్థం కాలేదు.

"ఏం? ఏం జరిగిందేమిటి-సూర్యా?" అన్నాడు. సూర్యకాంతం కష్టపడి దుఃఖాన్ని ఆపుకుంటూ ఎగపుతోనే ఇలా అంది:

"నేను చచ్చిపోయినా బావుణ్ణు"

ఇంకా వెక్కి వెక్కి ఏడుస్తోంది. రామం తలమీద ఎవరో వ్రేటు వేసినట్టు, అతని కాళ్లు పాతాళ లోకంలోకి ఎవళ్ళో లాక్కుపోతున్నట్టు, యమకింకరులు అతన్ని కట్టివేసి యముడి దగ్గర నిలబెడితే, యముడు అతన్ని చిత్రవధ చెయ్యమని ఆజ్ఞాపిస్తున్నట్టు! అతని తల తిరిగిపోయింది.

ఆదరంతో ప్రేమించే భార్యని ఇంతగా బాధపెట్టే తన జీవితం ఇంకెందుకు? ఎవరి కోసమని బతకాలి? ఇంకా బానిస బతుకేనా? తనెవరిని సంతోష పెట్టాలి? సవతి తల్లినా? ఏభై ఏళ్లుదాటి రెండో భార్య చేతిలో కీలు బొమ్మలా బతికే తండ్రినా? ఇంత బానిస బతుకు బతికితే ఎవరూ సంతోషించేవారు లేరు! తన తల్లే బతికితే తన భార్య ఈవిధంగా హింసలకి గురి అవుతుందా? అంతకీ సవతి తల్లే కారణం! ఆవిడ పరిపాలించే రాజ్యంలో వీళ్ళంతా దాసీలు. కాకపోతే మరేమిటి? అవును. ఆవిడ మాత్రం ఏమి చేస్తుంది? ఇంటికి పెద్దయిన మగవాడు, తండ్రే ఆమెకు తనంత లొంగిపోతే, పెత్తనం ఛలాయించక ఏం చేస్తుంది. అంతకీ కారణం ఆ ముసలి తండ్రే! ఆవిడని సంతోషం పెట్టడంకోసం ఎందర్నయినా హింసిస్తున్నాడు. ముమ్మాటికి కారణం ఆయనే!

నలభై ఏళ్ళు దాటాక తన్ని బాధించడానికి కాకపోతే ఎందుకు పెళ్ళాడాడు తండ్రి. అది తన అమ్మమ్మ ఏనాడో చెప్పింది. ఒక మగవాడు ఎన్నిసార్లయినా పెళ్ళి చేసుకుందుకు వొప్పుకునే లోకం, మరొకడు ఒక స్త్రీతో జీవితాంతం పెళ్ళి కాకుండా వుండడం వొప్పుకోదు. తనైతే అంతగా కామతృష్ణ వుంటే ఏవేశ్య దగ్గరికైనా పోనుగాని, ఇట్లా పిల్లల్ని సర్వ నాశనం చెయ్యకపోను.

రామానికి తండ్రిమీద చెప్పలేని కోపం వొచ్చింది. మనసులో ఏవేవో ఆలోచించుకున్నాడు.

రమణమ్మా, కూతురూ వొచ్చారు. కూతురు రామందగ్గరికి పరుగెత్తింది: "అన్నయ్యా? ఇవ్వాళ వొదిన అన్నం తిన్లే! జ్వరంకూడా తగిలింది."

రామానికి ఇంట్లో సంగతంతా తెలిసింది. ఎంతరాక్షసులు అయినా ఇంత కఠినమా?

"ఏం రాణీగారు లేవలేదా? ఇంట్లో దీపాలన్నా వెలిగించుకో నక్కర్లేదన్న మాట" రమణమ్మ ఏదో గోడనన్నట్టు అంటూ దీపం వెలిగించసాగింది. రామం ఏదో అనబోయినా, మాములు అణకువతో పెదిమలు పెగల్లేదు.

మర్నాడు రామం ఎవరో మనిషినిచ్చి భార్యని వాళ్ళూరు పంపించాడు. ఇంట్లో ఎవరికీ చెప్ప లేదు. బండి పంపించాక ఇంట్లోకి వచ్చినప్పుడు రమణమ్మ అంది సాగ తీసుకుంటూ,

"దొరసానిగార్ని సాగనంపావా? ఈ నరకంలో బాధ పడ్కేకండా వుంది గావును."

"అవును. నరకమే నయం ఇంతకంటే!" అన్నాడు రామం.

"ఏమిట్రా పేలుతున్నావ్? ఇంతదిగా పెంచి పెద్దచేసింది చాలక కొరుకూతలు కూస్తున్నావు? ఇది నరకంలా వుంటే వేరే ఎక్కడయినా స్వర్గాన్ని సృష్టించుకో, పోయి" అన్నాడు బ్రహ్మానందం కంటిమీది కళ్లజోడు ముక్కుమీదికి తోసుకుని.

"అవును. మాఅమ్మ పోయినప్పుడే అనుకున్నాను, నువ్వెప్పుడో ఇలా అని తీరుతావని" అన్నాడు రామం మళ్ళా శాంతంగానే.

రమణమ్మముఖం కందిపోయింది. "చూశారూ? మాట్లాడితే అమ్మఅమ్మ అంటాడు. నే నేం లోటు చేసేనని."

కళ్ళని చీర చెరుగుతో తుడుచుకుంది.

"ఏరా! పిట్ట కూత పట్టిందన్నమాట! సమాధానాలు చెప్పేవరకూ వొచ్చిందీ? నోరు మూసుకుని కుక్కలా పడుంటే పడుండు. లేకపోతే అవతలకి నడు" అన్నాడు తండ్రి దగ్గరికి వెళ్ళి దవడమీద ఒకటి కొట్టి.

రామం ఏం బదులు పలకలేదు. మౌనంగా దవడని దెబ్బతలిగినచోట పట్టుకుని నించున్నాడు. ముసలివాడు మళ్ళీ వెళ్ళి తన చోటులో కూచున్నాడు. అతని ఈ చర్యనిచూసి రమణమ్మకూడా నిశ్చేష్టురాలైంది.

"అతను అంతేలే" అని మాత్రం సణిగాడు రామం. మనస్సు కోపంతో రగుల్తోంది. తండ్రిమీద చెప్పలేని అసహ్యం కలిగింది.

"పడుంటే కుక్కలా పడుండాలిట. యిన్నాళ్లు అల్లానే పడున్నాను. కుక్కలుకూడా తిరగబడతాయని ఆయన తెలుసుకోలేదు. ఎంత యజమానైనా పెట్టే హింసని కుక్కలు కొంత వరకు మాత్రమే సహిస్తాయి. దాని తర్వాత మీదబడి కరుస్తాయి."

తర్వాత పొలం వెళ్ళిపోయాడు. పొలంలో పనేమీ చెయ్యలేకపోయాడు. అంతకంటె ముఖ్యమైన విషయం దేనిమీదో మనస్సు నిమగ్నమవసాగింది.

తన కష్టాల్ని దూరం చేసుకోవాలి. తన సంసారాన్ని సుఖమయం చేసుకోవాలి. అన్నిటికీ కారణం తన తండ్రే! అతని సత్తా చూసుకునే తన సవతితల్లి అన్ని నాటకాలూ ఆడ కలుగుతోంది.

అదీ అతని నిర్ణయం!

కొంచెం చీకటిపడ్డాక యింటికి వొచ్చాడు. ఇంట్లో ఎవరూ అతనితో మాట్లాడ్లేదు. ఒక అరగంట పోయాక సవతితల్లి మాత్రం కూతురు చేత కబురు పంపించింది అన్నానికి లెమ్మని.

అతను ఆకలి లేదన్నాడు. తర్వాత అంతా ఊరుకున్నారు.

తెల్లవారుజామున మూడు గంటలకి తండ్రి బయటికి వొచ్చినవాడు "అమ్మా" అని అరిచాడు. కిందపడి కొట్టుకొన్నాడు కొన్ని క్షణాలు! అదే ఆయన అంతం. సవతితల్లి బయటికి రాగానే ఎవరో దొడ్డివెపు పరుగెత్తిన అడుగుల చప్పుడు, నూతిలో ఏదో పడిన ధ్వనీ వినపడ్డాయి. ఆవిడ భోరుమని ఏడవసాగింది. రామంకూడా గదిలోంచి వొచ్చాడు. అతడు ఆడదానిలా వెక్కి వెక్కి ఏడవలేదు గాని, కళ్ళవెంబడి రెండు కన్నీటి ధారలు కారాయి.

ఊళ్ళోవాళ్ళంతా అక్కడ చేరారు.కొందరు లాంతర్లు పెట్టీ, బ్యాటరీ లైట్లతోనూ ఇల్లూ,దొడ్డీ వెతకసాగారు. నూతిలోని నీళ్ళుమాత్రం కదులుతుండడం గ్రహించారు. రామంకూడా కొంత సేపయ్యాక తండ్రిమీదపడి ఏడవసాగాడు.

* * *

మర్నాడు పది గంటలకి పోలీసులు వొచ్చారు. ఇల్లంతా పరిశోధనలు చేశారు. రక్తంచారలు ఆధారంగా రామం మీద నేరంమోపారు. అతన్ని జైలుకు తీసుకువెళ్లారు.

రెండు రోజులక్రితం నిండుగా మనుషులతో వున్న రమణమ్మగారి ఇల్లు ఆవేళ దిగాలు పడి వుంది. ఊళ్లోని పెద్దలంతా బ్రహ్మానందంగారి దహనసంస్కారాలకి తోడ్పడ్డారు. పరామర్శలకి వొచ్చిన బంధువులంతా తమ పనుల్ని ముగించుకుని వెళ్లారు.

రమణమ్మకి ఏమీ పాలుపోలేదు. తన భర్త పోయినందుకు ఆట్టే విచారించలేదు. ఎందుకంటే తనకి ముసలివాణ్ణిచ్చి తల్లితండ్రులు పెళ్లి చేసినప్పుడే అనుకుంది ఈరోజు ఎప్పుడో ఒక నాడు తప్పదని. ఇంకా అదృష్టవంతురాలు గనక తన భర్త ఇన్నేళ్లయినా బతికున్నాడు.

ఎందుకో రామంమీద అమితమైన సానుభూతి కలిగింది. తన కాఠిన్యం, అతని మెత్తదనం, తన భర్త కర్కశత్వం అన్నీ తల్చుకుంది గావును, కళ్ళు చెమ్మగిల్లాయి.

భర్తని పోలీసులు తీసుకువెళ్ళిన వార్తవిని సూర్యకాంతం బండి దిగింది. అత్తగారిమీద పడి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"అత్తయ్యా! ఆయన్ని క్షమించవూ? ఆయనేం ఎరగరు. మృత్యుగహ్వరంలోవున్నా ఇంత కాఠిన్యమా?"

కొళ్ళు కూడా పట్టుకుంది. రమణమ్మ కళ్ల వెంబడి నీటిధారలు కారాయి.

"అమ్మాయి, ఏడవకు. లే! నా చేతిలో వున్నదంతా చేస్తాను. నాకు మాత్రం ఇంకెవరున్నారు. కొడుకైనా కూతురైనా అతనే! అతన్ని అంతసులువుగా వొదులుకుంటానా? పోయిన ప్రాణం ఎల్లాగా తిరిగి రాదులే, అమ్మా" అని ఓదార్చసాగింది.

ఆవిడనించి ఈ మాటలు విన్నాక సూర్యకాంతం మనస్సు కొంచెం శాంతించింది. తీర్పు నాడు ఇంక వినవల్సింది రమణమ్మగారి సాక్ష్యం మాత్రమే! ఆవిడొక్కతే విచారకర సంఘటనని చూసింది. హంతకుడు పారిపోవడం, ఏదో సరుకులు నూతిలో పారవేయడమూను.

రమణమ్మగారు కాలినడకనే సాక్ష్యానికి బయలుదేరింది. వూళ్ళోవాళ్ళూ చుట్టుపక్కలి గ్రామాలవాళ్ళూ, ఆవిడ గాంభీర్యాన్నీ, నిశ్చలత్వాన్నీ మెచ్చుకోసాగారు.

"అవును! ఆవిడ చెప్పే సాక్ష్యంతో ఆ హంతకుడికి, తండ్రిని హత్యచేసిన దుర్మార్గుడికి తగినశాస్తి అవుతుంది. అప్పటితో లోకం శాంతిస్తుంది" ఇదీ వాళ్ళ ఆలోచన.

ఆవిడ బోనులో కెక్కింది. కోర్టుహాలంతా జనంతో నిండివుంది.

"దేవుని ఎదుట నిలిచి సత్యమే చెబుతాను. అబద్ధం చెప్పను" అని చెప్పసాగింది.

"నాభర్త హత్య చెయ్యబడ్డ సమయంలో ఈ నా కొడుకు తన గదిలో నిద్రపోతున్నాడు. నా ఏడ్పు విన్నతర్వాతనే ఇతను తన గదిలోంచి లేచి వొచ్చాడు. హంతకుడు వేరే ఎవరో అయివుండాలి. నా కొడుకు మాత్రం నిర్దోషి."

ఇంత బలమైన సాక్ష్యం అతను దోషి కాదన్నప్పుడు, తక్కిన సాక్ష్యాలు పని చెయ్యలేదు. అందుకని కేసు కొట్టివేయబడింది.

రామాన్ని విడుదలచేశారు. అతను ఒక్క పరుగున సవతితల్లిని సమీపించాడు. క్షమించమని వేడుకున్నాడు. ఇంత కాఠిన్యం గల ఆవిడ హృదయం అలా ఎందుకు పరివర్తన చెందిందో అతనికి మాత్రం తెలియలేదు.

ఇంటికివొచ్చాక ఇంటి పెత్తనం అంతా తల్లికే అప్పగించి "నీ యిష్టమొచ్చినట్టు సంసారాన్ని సాగించు. మేమందరం నీచెప్పు చేతల్లో వుంటాం" అన్నాడు రామం.

ఆవిడ ముందర వొద్దన్నా అతను మనస్ఫూర్తిగా ఇస్తున్న గౌరవాన్ని స్వీకరించింది. నెమ్మదిగా సూర్యకాంతం కూడా ఇంటిపనులు నేర్చుకుని అత్తగారి ప్రేమకి పాత్రురాలవసాగింది.

అప్పుడప్పుడు రమణమ్మగారు రామం వినయ విధేయతల్ని చూసి అనుకుంటుంది: "ఏవో దుర్భర పరిస్థితులవల్ల హంతకులుగాను, దుర్మార్గులుగాను మారినవారిని ఉరితీయడమో, నిర్బంధించడమో చేస్తారుగాని, వాళ్ళని సమాజంలో బతకనిచ్చి వాళ్లు చేసిన నేరానికి పశ్చాత్తాపం పొందేలా చేసే అవకాశాన్నివ్వడం అన్నిటికంటె గొప్ప శిక్షగావును" అని.

ఇప్పుడు రమణమ్మగారు రామానికి సవతి తల్లి కాదు-రెండో జన్మ నిచ్చిన తల్లి.

స్కెచ్

# ఆదర్శాల అన్వేషణ

"శ్రీ విరించి"

ఈ కథ రాయటమే అసలు అనవసరం. రాసినా పాత్రలకు పేర్లు పెట్టటం మరీ అనవసరం. అయినా ఒక తప్పేలాగూ చేస్తున్నాను గనుక రెండోదానికోసం అంత భయపడనక్కర్లేదు. రోటిలో తలదూర్చి రోకటిపోటులకు వెఱవటం ఎందుకు? సరే కానివ్వండి! జరగాల్సిందేదో జరిగే తీరుతుంది. ఎవడి కర్మకో నేను వెఱవాల్సిన అవసరం?

సీతారామయ్య నామాట కాదని, నాలుగెకరాల పొలమూ అమ్ముకుని, ఆ వెనక బస్తీ చేరుకున్నాడు. శుభ్రమయిన గదొకటి తీసుకుని అందులో వుంటున్నాడు. బస్తీలో తెలిసో తెలియకో యిబ్బందిపడాల్సిన అవసరం తప్పిపోతూ వచ్చింది, చేతినిండా డబ్బుండటంవలన. వాడు తను వొచ్చిన పనేదో చూచుకొంటూ, గుట్టుగా బతికితే యీ కథే లేకపోవును. కాని అట్లా జరగక పోవటంవల్లే!

తన కొగది అద్దెకు యిచ్చిన విచిత్రవ్యక్తి భూషణం పోకడలు గమనిస్తూవచ్చాడు. ఆ భూషణం అనే ఆయనకు యిక్కడే యిల్లేగాక మరో దిక్కుగా రెండుమేడలు వున్నాయనీ, ధనాశేగాక స్థలవిస్తీర్ణాన్నిబట్టి వాటిని ఎవరెవరికో అద్దెలకిచ్చేసి యీ డాబాలో ముందుగదిని వీడికిచ్చి మిగతా నాలుగు గదుల్లోనూ భార్యాసమేతుడై కాపురం చేస్తోన్నాడనీ, వీరిద్దరికీ ఒక కొడుకువున్నా అతనెప్పుడూ పట్నంనుంచీ దిగిరాడనీ తెల్సుకోడానికి సీతారామయ్యకే గాదు, దారిన బోయేవాడి కెవరి